# పాములవాడు

శ్రీ రాచకొండ శ్రీహరి

ఈ అనంత విశ్వంలో ప్రతి ఆకు ప్రతి పూవు, ప్రతి అణువు రససృష్టికి గోచరించబుచ్చే దివ్యవస్తువే.

ప్రకృతిలో ప్రవహించే ఆ యా రసవాహినులనుండి కళోపాసకుడు తనకందిన భావాలను విరిహారాలు గ్రుచ్చుకుంటూ వుంటాడు.

లలిత కళలకు ఆధారమైన వస్తు స్వరూపాలన్నిటిలో మానవుడు ఉత్తమస్థానమాక్రమిస్తున్నాడు. మానవుడి హృదయంలో అనుక్షణం పైకుబికే భావోద్దీపనలన్నీ కవితాలోకానికి కానుకలే. మానవహృదయం అతి విశాలమైనది; ఆ హృదయ పరిణామాన్ని అర్థంచేసుకొని అన్వయించుకొని వాటిని ఉత్తమమైన వర్ణనలలో చిత్రించగలుగుటయే కళాస్రష్టల విధి.

అడవిలో పూసిన మల్లెపూలలో కూడా—మనం పందిరులల్లి పెంచిన పొదరింటి పూవులకు గలంత పరిమళం వుంటుంది; రాణింపు వుంటుంది. కాని అవి అడవినబడి, అలంకారాయోగ్యం కాలేక ప్రకృతికే తమ సౌరభ్యాన్ని అంకితంచేసి నశించి పోతవి. కవితావేశంగల హృదయం ఆ పూవును చూచినపుడు దానిలోని సౌందర్యాన్ని, సత్యాన్ని వర్ణించి లోకానికొక పాఠం చెప్పకుండా వుండలేదు.

మానవ సంఘంలోకూడా అలా ఆడవి పూవులలాగా విసిరవేయబడినట్లు పడివున్న జాతులెన్నో వున్నాయి. వారి హృదయాలలో పవిత్ర ధర్మం, స్వార్థత్యాగం, ప్రేమ మొదలైనవి పరిపూర్ణత చెందివున్నాయనేది లోకానికి మాటిమాటికీ వినిపించవలసిన ఒక పాఠం.

ఎక్కడో ఏ చెట్లనీడనో, దూరపు అడవులలో నివసించుతూ తమ సంఘానికి తామే ఒరులు అమర్చుకొని, ఒక్క నీతికి కట్టువడి, ఒక్క మాటకు తలవొగ్గి బ్రతుక నేర్చిన శక్తిగల పాములవాళ్ల హృదయాలను వర్ణించిన ఒక గ్రంథం—నపేర్రా ఉత్కృష్టమైన మానవ జాతికొక అవయవంవంటి ఈ అడవి జతులకుకూడా హృదయమున్నదని రూపించే చిత్రం నపేర్రా!

జహూర్ అనే ఒక నాయకుడు పాముల విషాన్ని తనలోనికి పోవచేసుకొని, దానిని మంత్ర శక్తిచేత హరించుకొని, యోగసిద్ధి పొందడానికి ప్రయత్నిస్తుండగా అతనికొక సర్పదష్టమైన బాలిక కనిపిస్తుంది. అతడు ఆమెను రక్షించాడు. కాని అతని ఉపాసన సిద్ధించాలంటే బ్రహ్మచర్య దీక్ష అతనికి

అవసరం. అందుచేత అతడు ఆ పిల్లకు మగవేషం వేసి చందన్ అను పేరుపెట్టి తన యింటనే వుంచుకున్నాడు. ఆ రహస్యము అతనికే తెలుసు. అతడు పూజించే మనసాదేవికే తెలుసు. అప్పటినుంచి అతని యోగసిద్ధి పతనమై పోతున్నదనే సంగతి అతనికి తెలియదు — మనసాదేవికే తెలుసు. ఒకసారి స్త్రీ సౌందర్యాన్ని విలోకించి అతడు చకితుడైనాడు! ఆనాడే అతని సిద్ధి అధోముఖమైనది. భగవంతుని పరంగా నిష్కామ కర్మ లిప్సతో ప్రయత్నించే యోగపద్ధతికి పతనముండదు. కాని ఒక వ్యక్తి ఒక స్థానాన్ని, శక్తినీ కోరి చేసిన సాధనకు పతనం తప్పదు. అదే యిందులోని పరమార్థం. యోగ సిద్ధిలో అతడు నెగ్గలేక పోయాడు. తిరిగి సామాన్య మానవ ధర్మాల్ని గ్రహించి, ప్రేమ సామ్రాజ్యానికి పట్టభద్రుడూ కాలేక పోయాడు. చందన్‌ను మగవాడుగా గ్రహించి మాటుశ్రీ అనేకన్య వరించింది. చందన్ నిజవృత్తాంత మెరిగి జుమ్రూఅనే సుందరుడొకడు ఆమెను వరించాడు. వీరిద్దరిప్రేమ జహార్‌కు తెలియకుండానే అల్లిబిల్లిగా అల్లుకొని లతలు మొగ్గలు తొడిగింది. ఒకనాడు జమ్రూ నాయకుడైన జహార్‌కుతన ప్రేమవృత్తాంతం చెప్పాడు. కాని జహార్ చందన్‌కిదివరకే పెళ్లి అయిందని చెప్పాడు, ఆ నిరాశతో — వెళ్లాడతడు.

చందన్ మగవాడు కాదు ఆడది — జహార్ ఆమెను ప్రేమిస్తున్నాడనే వార్త గ్రామమంతటా ప్రాకింది. అది విని జహార్ తను ప్రేమించడంలేదని వాగ్దానం చేశాడు. జమ్రూకా వృత్తాంతం తెలిసి తిరిగి వచ్చి చందన్‌ను తీసుకొని పారిపోయాడు. జహార్ దీనిని సహించగలడా!

ఒక ప్రక్క అతని యోగసిద్ధి పూర్తికానున్న సమయం! ఒక ప్రక్క తన జీవితానికి వెలుగు తెస్తుందని ఆశపడి దాచికొన్న స్త్రీరత్నం మరొకళ్లదై పోతున్నదనే విషాదం—అతడు యోగాన్నే త్యజించి పగసాధించుకో తలుచుకున్నాడు. నల్లత్రాచును మంత్రించి వదిలాడు.

చందన్ ప్రియుడివియోగం సహించలేదు. అతని క్షేమమే ఆమెకు ప్రాణం. అతడులేని ప్రపంచమంతా శూన్యం అతనికోసం! తన్నయినా అర్పించుకో కలిగింది. ఆ స్వార్థరాహిత్యాన్ని, ప్రేమ బలాన్ని సిద్ధభావాన్ని చూచి జహార్ తన క్రోవను ఉపశమించుకోకలిగాడు. వారికి అడ్డంరాకుండా తనేతొలగి ప్రాణాల్ని అర్పించాడు. అదే అతని చరమసేవ; అదే అతనికి ముక్తి.